క్లుప్తంగా

గ్రామాల్లో 'రాజీవ్' దరఖాస్తుల పరిశీలన

మంచాల: రాజీవ్ యువ వికాసం రుణాల కోసం ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను గ్రామస్థాయిలో పరిశీలించి, ధ్రువీకరించనున్నామని ఎంపీడీఓ బాలశంకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మంచాల మండల పరిధి 23 గ్రామ పంచాయతీలలో 2,482 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. వాటిలో 672 మందికి మాత్రమే పథకం కింద రుణాలు ఇవ్వనున్నామని ఎంపీడీఓ చెప్పారు. పథకానికి దరఖాస్తు చేసుకున్న వారందరూ శుక్రవారం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించే నిర్ధారణ కార్యక్రమంలో పాల్గొని, అర్హులు రుణాలు పొందాలని సూచించారు.

న్యాయం చేయండి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న పట్టణ వాసులు

ఆమనగల్లు: ప్రభుత్వ జూనియర్ కళాశాల భూ సమస్యను పరిష్కరించి, న్యాయం చేయాలని ఆమనగల్లు పట్టణానికి చెందిన పలువురు కోరారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఎంపీ డాక్టర్ మల్లు రవి నివాసంలో చిన్న జంగయ్య, యాదయ్య, మల్లేశ్, గిరి కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమనగల్లు పట్టణంలోని కళాశాల భూమిపై తమ కుటుంబాలకు హక్కు ఉందని, సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. దీనికి స్పందించిన ఎంపీ.. సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, బాధిత కుటుంబాలకు, విద్యార్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, నాయకులు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



మాట్లాడుతున్న జంగయ్యయాదవ్

ఇబ్రహీంపట్నం: పార్టీ బలోపేతానికి కమలనాథులు కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఇబ్రహీంపట్నం మండల ఇన్‌చార్జి కడారి జంగయ్య యాదవ్ పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయి నుంచి సమావేశాలను నిర్వహించి పార్టీ, పటిష్టతకు పాటుపడాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. త్వరలో పూర్తిస్థాయి మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నామన్నారు. అనంతరం భవిష్యత్తులో చేపట్టాల్సిన పార్టీ కార్యాచరణ ప్రణాళికను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సింహారెడ్డి, బోసుపల్లి ప్రతాప్, పోరెడ్డి అర్జున్‌రెడ్డి, ఉడతల నర్సింహగౌడ్, కంబాలపల్లి శ్వేత, దండె శ్రీశైలం, మొగిలి గణేశ్, దొండ రమణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, బాబులు, విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మలుపుల వద్ద చెట్ల కొమ్మలు తొలగించండి



మలుపు వద్ద ఏపుగా పెరిగిన చెట్లు

కొత్తూరు: మలుపుల వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. కొత్తూరు మండలం సిద్ధాపూర్ నుంచి కోళ్లపడకల్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో ఉన్న మలుపుల వద్ద రోడ్లకు ఇరువైపులా చెట్లు ఏపుగా పెరిగాయి. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొమ్మలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

షాబాద్: పిడుగుపాటుకు గురై మృతి చెందిన బాధిత కుటుంబానికి అండగా ఉంటామని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మక్తగూడ గ్రామానికి చెందిన సోలీపేట్ స్వరూప పిడుగు పడి మృతి చెందగా ఆమె కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

గ్రాసం కరువై.. పోషణ భారమై



వరిగడ్డి కొనుగోలు చేసి తీసుకెళ్తున్న పాడి రైతు

రియల్ వ్యాపారంతో పశుగ్రాసానికి కష్టాలు తప్పడం లేదు. సాగు విస్తీర్ణం తగ్గడం, ఉన్న కొద్దిపాటి వ్యవసాయ పొలాలు ప్లాట్లుగా మారుతుండటంతో గడ్డికి గడ్డు కాలం ఏర్పడింది. దీంతో పాడిని నమ్ముకున్న రైతులు.. మూగజీవాల పోషణ భారమై కబేళాలకు తరలిస్తున్నారు!.

- మూగజీవాలపై రియల్ ఎఫెక్ట్
- ప్లాట్లుగా మారుతున్న పంటభూములు
- పశుగ్రాసం కోసం పాడి రైతుల పాట్లు
- పోషణ భారం భరించలేక కబేళాలకు తరలిస్తున్న వైనం



వెంచర్‌గా మారిన పంట పొలాలు

కడ్తాల్: మండల పరిధి గ్రామాల్లో 4 వేలకు పైగా పాడి రైతులు, 16 వేల వరకు పాడి పశువులు ఉన్నాయి. నిత్యం మండల పరిధి నుంచి 20 వేల నుంచి 25వేల లీటర్లకు పైగా పాల ఉత్పత్తి జరుగుతోంది. నీటి సౌకర్యం ఉండి, రైతులకు ప్రభుత్వం రాయితీపై పశుగ్రాస విత్తనాలు అందజేస్తున్నా.. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి, బోర్ల కింద పచ్చిగడ్డి సాగు రైతులకు సాధ్యం కావడం లేదు. ఫలితంగా గడ్డి కొరత ఏర్పడి పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. గత్యంతరం లేక కొందరు రైతులు పశువులకు ఎండుగడ్డి, శనగ, పల్లి పొట్టును కొనేందుకు సిద్ధపడుతున్నారు. ఆర్థికంగా లేని వారు పశువులను కబేళాలకు విక్రయించేందుకు సిద్ధపడుతున్నారు!.

లారీ గడ్డి రూ.30 వేలు

క్రమంగా సాగు భూములు తగ్గడం, ఉన్న భూములు సాగునీటి కొరతతో బీడు వారిపోవడం పాడి రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది. పశువులకు గ్రాసం లభించకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడానికి సిద్ధపడుతున్నప్పటికీ.. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ట్రాక్టర్ గడ్డికి రూ.15 వేలు, లారీ గడ్డి రూ.30 వేలకు పైగా వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. శనగపొట్టు టన్నుకు రూ.6 వేలు, మక్క పిండి రూ.3 వేలు, దాణా క్వింటాల్‌కు రూ.3,600లకు కొనుగోలు చేస్తున్నప్పటికీ అది రైతులకు అధిక భారంగా మారింది. భూమిపై పచ్చి గడ్డిపోచ లేక, తప్పని పరిస్థితుల్లో ఎండుగడ్డి, శనగపొట్టు తదితర వాటిని కొనుగోలు చేస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశుగ్రాసం సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం పశుగ్రాసాన్ని రాయితీపై నేరుగా అందించాలని రైతులు కోరుతున్నారు.

పచ్చదనం మాయం

రియల్ వ్యాపారం పుణ్యమాని భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఫలితంగా సాగు భూములు క్రమంగా వెంచర్లుగా మారుతున్నాయి. కాలం కలిసి రాక కొందరు, వ్యవసాయం చేయలేక ఇంకొందరు తమ పంట పొలాలను విక్రయిస్తున్నారు. దీంతో పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. పశుగ్రాసం లేక మూగజీవాలు అల్లాడిపోతున్నాయి.

ఖర్చు పెరిగింది



పాడి పరిశ్రమను నమ్ముకొని బతుకుతున్నాం. గతంలో కరువుతో పంటలు పండక పోయినా.. పాడిపైనే జీవనం పొందేవారం. ప్రస్తుతం పశువులకు గడ్డి దొరకడం లేదు. సాగు భూములు వెంచర్లుగా మారుతుండటంతో వాటి పోషణ కష్టంగా మారింది. ఖర్చు పెరిగి, ఆదాయం తగ్గింది. రాయితీపై గ్రాసం అందజేసి ప్రభుత్వం ఆదుకోవాలి.

– జగన్‌నాయక్, పాడి రైతు, టాక్‌రాజ్‌గూడ, కడ్తాల్

రాయితీపై ఇవ్వాలి



మండలంలో అత్యధికంగా పాడి రైతులు ఉన్నారు. మూగ జీవాలను నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నారు. రియల్ వ్యాపారంతో పచ్చని పంట పొలాలు వెంచర్లుగా మారుతుండటంతో పశువులకు గడ్డి దొరకని పరిస్థితి నెలకొంది. వాటి పోషణ భారం కావడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం పాడి రైతులకు సబ్సిడీపై పశుగ్రాసం అందజేసి ఆదుకోవాలి.

– పరమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, కడ్తాల్



తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి
- పైపులైన్ ఏర్పాటు పనులకు భూమిపూజ

కడ్తాల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అభివృద్ధి నిధులు రూ.5 లక్షలతో మండల పరిధి మైసిగండిలో పదుశ్రీ ప్యారడైజ్ కాలనీ, ఎల్లమ్మ తండాల తాగునీటి అవసరాలకు మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణ పనులకు వారు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, పొల్యూషన్ కంట్రోల్ మెంబర్ బాలాజీసింగ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు బీచ్యానాయక్, జగన్, నాయకులు జవహర్‌లాల్, హీరాసింగ్, చందోజీ, శేఖర్‌గౌడ్, చేగూరి వెంకటేశ్, కిషన్, తులసీరాం, అమర్‌సింగ్, దేవా, చిన్న, సాయి, శివరాం, ప్రేమ, లక్ష్మీ, శారద, కవిత తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది: కాంగ్రెస్ నాయకులు



రైతులతో మాట్లాడుతున్న నాయకులు

ఆమనగల్లు: 'రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేస్తుంది. రైతులు ఆందోళన చెందవద్దు' అని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నర్సింహ పరిశీలించారు. వడ్లను తీసుకువచ్చిన రైతులతో మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోరాదని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. సన్నాలకు అదనంగా రూ.500 బోనస్ వస్తుందని చెప్పారు. అనంతరం మార్కెట్‌యార్డులో రైతుల కోసం ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, నరేశ్‌నాయక్, రవీందర్, రమేశ్‌గౌడ్, నాయకులు ప్రసాద్, పర్వతాలు, మెకానిక్ బాబా, మహేశ్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అన్యాయం చేస్తున్న కేంద్రం

- సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

యాచారం: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. గురువారం గునుగల్ క్రీడా క్షేత్రంలో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, కార్పొరేట్ సంస్థలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆరోపించారు. కార్మికులకు అనుకూలమైన చట్టాలను రద్దు చేసి, వ్యతిరేక చట్టాలను తెచ్చి తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం, నిరుద్యోగ సమస్య తీర్చకపోవడం, అధిక ధరలను నియంత్రించకపోవడం, పేదరికాన్ని అరికట్టకపోవడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య, మండల కన్వీనర్ చందునాయక్, క్రీడాక్షేత్రం నాయకులు రాములు, శివుడు, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ప్రేమ వెలకట్టలేనిది



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకురాలు లీలా

ఆమనగల్లు: ప్రపంచంలో తల్లిదండ్రుల ప్రేమ వెలకట్టలేనిదని, వారిని ఎల్లప్పుడూ గౌరవించాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకురాలు లీలా లక్ష్మారెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాల ఆవరణలో మూడు వారాలుగా సాయిరాం మెడికల్స్, వందే మాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరం కొనసాగుతోంది. ఈ సందర్భంగా గురువారం 250 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రుల పాదాలను కడిగి, ఆశీర్వాదం తీసుకున్నారు. అంతకుముందు జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలబాలికలు సెల్‌ఫోన్లు, వీడియోగేమ్‌లతో కాలం వృథా చేస్తున్నారని, పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి, తల్లిదండ్రులను, గురువులను గౌరవించడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. సెల్‌ఫోన్లను పక్కన పెట్టి, నచ్చిన రంగాల్లో రాణించాలని సూచించారు. కన్నవారికి, ఉన్నఊరికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రాము, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మహమూద్, కల్చరల్ అకాడమీ డైరెక్టర్ చిత్తరంజన్ దాస్, యోగా గురూజీ రమేశ్, ఫౌండేషన్ వలంటీర్లు శ్రీశైలం, కవిత, శ్యామల, నాగార్జున, దీపక్, గోపి, జంగయ్య, అనిత, పల్లవి, ఉదయ్‌కుమార్, అశోక్, సాయిచరణ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రావణ్‌రెడ్డి



విధుల్లో చేరుతున్న లైవ్‌స్టాక్ అసిస్టెంట్ స్వప్న

కేశంపేట: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి మన్ననలు పొందాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తాండ్ర శ్రావణ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధకశాఖలో ఖాళీలను ఇటీవల భర్తీ చేసింది. అందులో భాగంగా మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, పాపిరెడ్డిగూడ, కొండారెడ్డిపల్లి గ్రామాల్లోని పశు వైద్య ఉపకేంద్రాల్లో లైవ్ స్టాక్ అసిస్టెంట్లను కేటాయించింది. ఈ సందర్భంగా పాపిరెడ్డిగూడ గ్రామంలోని పశువైద్య ఉపకేంద్రంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా స్వప్న గురువారం విధుల్లో చేరారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులు పాడి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో ఉద్యోగులు అవినీతికి ఆస్కారం లేకుండా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ నిఖిత, శివయ్య, అబ్బి సుందరయ్య, యాదయ్య, రాణి, రవీందర్, అంజనేయులు, సత్యంగౌడ్, రామస్వామి, రాంచందర్, భిక్షపతి, కృష్ణయ్య, శ్రీను, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోరా?

యాచారం: ఫార్మాసిటీకి సేకరించిన భూముల విషయంలో అధికారులు చట్ట వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఫార్మా భూముల్లో ఎలాంటి సర్వే, ఫెన్సింగ్ పనులు చేయరాదని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. తాజాగా ఫార్మాకు సేకరించిన నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోని భూముల్లో పంటలు సాగు చేయరాదని వ్యవసాయ శాఖ ద్వారా సమాచారం అందించడం సరైంది కాదని హితవు పలికారు. రైతులకు మద్దతుగా పోరాటం చేయడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటామని పేర్కొన్నారు.

బాధిత రైతుకు ఆర్థికసాయం

చేవెళ్ల: పిడుగుపడి ఓ రైతుకు చెందిన రెండు ఎద్దులు మృతి చెందగా.. బాధిత కుటుంబానికి నాయకులు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. మండల పరిధి పామెన గ్రామంలో బుధవారం రాత్రి పిడుగుపాటుకు రెండు కాడెద్లు మృత్యువాత పడ్డాయి. దీంతో పలువురు నాయకులు బాధిత రైతు సదానందంకు గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. సోషల్ మీడియా, పత్రికల్లో వచ్చిన సమాచారానికి మండల నాయకులు, ప్రజలు స్పందించారు. రైతుకు నేరుగా కొందరు ఆన్‌లైన్ ద్వారా, మరికొందరు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అందించిన నగదును మాజీ సర్పంచ్ దవాల్గారి గోపాల్‌రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు.



సాయం అందిస్తున్న మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, గ్రామస్తులు

సేంద్రియ సాగు.. ప్రయోజనాలు బాగు

- తక్కువ ఖర్చుతో.. అధిక దిగుబడి
- వ్యవసాయ శాస్త్రవేత్తలు నిర్మల, సుజాత



రైతు సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

ఆమనగల్లు: సేంద్రియ సాగుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, అదే ఉత్తమ మార్గమని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ నిర్మల, డాక్టర్ సుజాతలు అన్నారు. వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిధి కోనాపూర్ గ్రామంలో గురువారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. మనుషుల ఆరోగ్యానికి, నేల సంరక్షణకు సేంద్రియ సాగు ఎంతగానో మేలు చేస్తుందన్నారు. రసాయనిక ఎరువులు వాడటం వలన భూసారం తగ్గిపోతుందని, అలాంటి పరిస్థితుల నుంచి బయటపడేందుకు ఈ విధానమే సరైందని తెలిపారు. పంటపొలాల్లో జీవామృతం, ఘన జీవామృతం, నీమ్‌కేక్, వర్మీ కంపోస్టు లాంటివి వినియోగించాలని, వీటికి ఖర్చులు తగ్గడంతో పాటు పంట దిగుబడులు అధికంగా వస్తాయని పేర్కొన్నారు. సేంద్రియ సాగుతో రైతులు ఆర్థికంగా లాభపడతారని, భవిష్యత్తులో భూమి పర్యావరణం సురక్షితంగా ఉంటుందని చెప్పారు. అనంతరం ఇంటర్ క్రాపింగ్ పంట విధానంపై వివరించారు. ఒకే విధానంలో రెండు లేదా ఎక్కువ పంటలను ఒకే స్థలంలో వేయడం ద్వారా మట్టి ఆరోగ్యం మెరుగుపడి, పంటల దిగుబడి పెరుగుతుందని శాస్త్రవేత్తలు స్వప్నశ్రీ, తరుణిలు వివరించారు. కార్యక్రమంలో ఆమనగల్లు ఏడీఏ శోభారాణి, వ్యవసాయ అధికారి అరుణకుమారి, ఏఈఓ మీనాక్షి, స్థానిక రైతులు యాదయ్య, సాయిరెడ్డి, నర్సింహాగౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఇన్‌చార్జి ఎంపీడీఓ జంగయ్య



నర్సరీని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి ఎంపీడీఓ యెల్లంకి జంగయ్యగౌడ్ అన్నారు. మండల పరిధి ముకునూర్ గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతి వనం, కంపోస్ట్ యార్డ్, క్రిమిటోరియంను ఆయన గురువారం పరిశీలించి మాట్లాడారు. పాలనాపరంగా ప్రజలకు ఏ సమస్య ఉన్నా.. పంచాయతీ అధికారులు చొరవ చూపి పరిష్కరించాలని సూచించారు. తాగునీరు, వీధిలైట్లు, పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ముకునూర్ గ్రామంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది పనితీరు బాగుందని కితాబు ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి రఘు, కార్యదర్శి రాజ్‌కుమార్, రిటైర్డ్ ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

సెలవులపై వెళ్లిన ఎంపీడీఓ వెంకటమ్మ

ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ వెంకటమ్మ సెలవుపై వెళ్లగా.. సూపరింటెండెంట్ యెల్లంకి జంగయ్యగౌడ్ ఇన్‌చార్జి ఎంపీడీఓగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సిబ్బంది ఆయనకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. మండల పంచాయతీ అధికారి రఘు, సిబ్బంది వెంకటకృష్ణ, యార కృష్ణ, శివ, కుమార్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ఎంపీడీఓ వెంకటమ్మ ఆరోగ్య సమస్యలతో, చికిత్స నిమిత్తం సెలవు పెట్టినట్లు సమాచారం.

నేడు రక్తదాన శిబిరం

చేవెళ్ల: ఎమ్మెల్యే కాలె యాదయ్య జన్మదినం సందర్భంగా చేవెళ్లలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ గొనే ప్రతాప్‌రెడ్డి, పామెన మాజీ సర్పంచ్ దవాల్గారి గోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఇరువు వారు మాట్లాడుతూ.. పట్టణంలోని కేజీఆర్ గార్డెన్‌లో శుక్రవారం ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ పాల్గొనాలని కోరారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రణాళిక

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని సీఎస్‌కే గ్రీన్ విల్లాస్‌లో సుమారు రూ.40లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొత్తూరు, షాద్‌నగర్ మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. టీడీఎస్ నిధులు రూ.25కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, శ్రీకాంత్‌రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, రఘునాయక్, జమృద్‌ఖాన్, శ్రావణి, నాగమణి, రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్‌రబ్ జామీ, సోమశేఖర్, సాదత్, శ్రీనివాస్‌రెడ్డి, శివరాంరెడ్డి, శివానంద్, డాక్టర్ చందులాల్ రాథోడ్, బాలు, ఉస్మాన్, రజింత్, బబ్బన్ సింగ్, ఉపేందర్, చంద్రశేఖర్, సత్తయ్య, పాల్గొన్నారు.